క్లుప్తంగా

పోషకాహారంపై అవగాహన సదస్సు

శావల్యాపురం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో పోషణ్ భీ, ఫడాయి భీ కార్యక్రమంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు రెండవరోజు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత పాల్గొని మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు క్రమం మంచి పోషకాహారం తీసుకోవాలన్నారు. చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్యను అందించాలన్నారు. మానవ జీవిత చక్రంలో పోషకాహారం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. మంచి ఆహారం మొలకెత్తిన గింజలు, ఆకుకూరలు, పాలు కోడి గుడ్లు, రోజువారీగా తీసుకోవటం వలన ఆరోగ్యంగా ఉంటారన్నారు.37 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు సదస్సులో పాల్గొన్నారు.

బాధితులకు దుప్పట్ల పంపిణీ



యడ్లపాడు: 'సేవా హృదయంతో చేసే ప్రతి చిన్న ప్రయత్నం సమాజంలో సానుకూల మార్పుకు దారి తీస్తుందని ఎం బాబురావు తెలిపారు. యడ్లపాడు మండలం చెంఘీజ్‌ఖాన్‌పేట బున్నీనగర్ నందు గుంటూరుకు చెందిన 'సర్వీస్ విత్ లవ్' స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం లెప్రసీ బాధితులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. సంస్థ చైర్మన్ వేలంగిణీ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి ఎం.బాబూరావు మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో సంకూరి ప్రసాద్‌రావు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యుల సహకారంతో బున్నీనగర్‌లోని కుటుంబాలకు వీటిని పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. అనంతరం సంకూరి రాజారత్నం, దేవరాజు, దేవయ్య, కోటేశ్వరమ్మ కుటుంబ సభ్యులు పాల్గొని లెప్రసీ బాధితులకు దుప్పట్లు అందజేశారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

డీఈఓ ఎల్.చంద్రకళ



రొంపిచర్ల: మండలంలో గోగులపాడు, రొంపిచర్ల గ్రామాలలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారిణి యల్. చంద్రకళ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో పదవతరగతి చదువుతున్న విద్యార్థుల మార్కుల గ్రేడ్స్‌ను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో ఆమె మాట్లాడారు. వెనుక బడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. మధ్యాహ్నభోజన పథకమును పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. ఈ నెల 15న జరిగే క్లస్టర్ సమావేశంలో ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ డి.బ్రహ్మేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు, బియం. సుభాని, హనుమంతరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నో బ్లాక్ డే కార్యక్రమం

నూజెండ్ల: ప్రభుత్వం చేపట్టిన విద్యా సంస్కరణలో భాగంగా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలలో ప్రతి మూడవ శనివారం నో బ్యాక్ డే కార్యక్రమం నిర్వహించుతున్నట్లు ఎంఈవో రవిచంద్ర తెలిపారు. నో బ్యాక్ డే సందర్భంగా విద్యార్థులు స్కూల్ బ్యాగ్ లేకుండా పాఠశాలకు రావాలని ప్రోత్సహించే రోజు అన్నారు. తరగతులకు బదులుగా విద్యార్థులకు బోధనేతర అంశాలు ఆచరణాత్మక అభ్యాసనలు ఉపాధ్యాయులు నిర్వహిస్తారు. దీనివల్ల విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి తగ్గించడానికి ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఉపాధ్యాయులు కాంపెక్స్ సమావేశాలు జరుగుతాయన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

నాదెండ్ల: చందవరం గ్రామానికి చెందిన మైనర్ బాలిక గుండబొమ్మ రేణుశ్రీ (17) ఇంట్లో వంట చేస్తుండగా అగ్నిప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై జి. పుల్లారావు వివరణ ఇచ్చారు. రేణుశ్రీ సాతులూరులోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుకుంటోంది. ఈ నెల 5న సాయంత్రం సమయంలో ఇంట్లో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు దుస్తులకు మంటలు అంటుకున్నాయి. దీంతో గాయాలపాలైన బాలికను కుటుంబ సభ్యులు నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ నెల 12న మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. 13న చికిత్స పొందుతూ మృతి చెందింది. తండ్రి రాజారమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నాదెండ్లలో పోషణ్ భీ.. పఢాయీ భీ కార్యక్రమం

నాదెండ్ల: ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషణ్ భీ, పఢాయీ భీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషకాహారంపై అవగాహన నిర్వహించారు. సూపర్‌వైజర్ నిర్మలకృష్ణమాల మాట్లాడుతూ, పుట్టిన బిడ్డ నుంచి ఆరేళ్ళ చిన్నారుల పోషణ, విద్యను అందించటంలో ప్రతి సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీలు అవగాహనతో పనిచేయాలన్నారు. అనంతరం వీడియో ద్వారా విద్యాబోధనపై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో సెక్టార్‌సూపర్‌వైజర్ కె.పద్మ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

రైతును ముంచిన ఎన్ఎల్ఆర్ వంగడం

రైతును దళారులే కాదు వంగడాలు మోసం చేస్తాయన్నది నూజెండ్లలో వెల్లడైంది. తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు గడించ వచ్చన్న ఉద్దేశ్యంతో సాగు చేపట్టిన వరి రైతులను ఇవాళ పెట్టిన పెట్టుబడి ఎక్కువై చివరకు అప్పులు మిగుల్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.



ధాన్యం నిల్వలు

- అన్నదాతలకు అగచాట్లు
- ఎకరానికి 20 నుంచి 25 బస్తాలు
- రూ.30 వేలు పెట్టుబడి
- కౌలు రైతుల పరిస్థితి దయనీయం
- 600 ఎకరాల్లో ఇదే దుస్థితి

నూజెండ్ల: ధాన్యం దిగుబడులు తగ్గి రైతులు ఆర్థికంగా నష్టపోయారు. నూజెండ్ల గ్రామంలో 600 ఎకరాల్లో ఎన్ఎల్ఆర్ (34449) రకం వరి వంగడాల సాగు చేశారు. పమిడిపాడు బ్రాంచ్ కెనాల్ పరిధిలో సాగునీరు విడుదల ఆలస్యం అవటంతో రైతులు కాలపరిమితి తక్కువ ఉన్న ఎన్ఎల్ఆర్ సాగుకు మొగ్గుచూపారు. ఈ ఏడాది వరి పంటలో ఉల్లికోడు ఉధృతి కావటంతో నివారణ చర్యలు చేపట్టిన పంట నష్టం నియంత్రణ చేయలేకపోయామని అన్నదాతలు వాపోయారు. విత్తనాలు కొనుగోలు నుంచి ఎరువుల వాడకం, వరి కోత వరకు రూ.30 వేలకు పైబడి పెట్టుబడులు పెట్టారు. గతంలో ఎకరానికి 40 బస్తాలు దిగుబడి వచ్చే పొలాల్లో ఈ ఏడాది 20 నుంచి 25 బస్తాలు దిగుబడులు వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. తెగుళ్ల కారణంగా పెట్టుబడులు అధికంగా పెరిగి దిగుబడులు తగ్గిపోవటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

ఎకరాకు 8 నుంచి 10 బస్తాలు కౌలు పోగా రైతుకు అప్పులు మాత్రమే మిగిలాయని వాపోతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే రైతు రాజు, రైతు లేనిదే రాజ్యం లేదు అనే నినాదాలు కాగితాలకు పరిమితమై రైతు కనుమరుగు అయ్యే పరిస్థితి వస్తుంది. ఈ ఏడాది సాగర్ జలాశయం నుంచి సాగునీరు విడుదల అయినప్పటికీ పమిడిపాడు బ్రాంచ్ కెనాల్ నుంచి నీటి విడుదల ఆలస్యమైంది. దీంతో రైతులు లేటు ఖరీఫ్ పంట సాగు చేయటంతో తెగుళ్ల బెడద అధికంగా ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

ఆర్థికంగా నష్టపోయా



ఈఏడాది నేను ఆరు ఎకరాలు కౌలుకు తీసుకొని ఎన్ఎల్ఆర్ రకం వరి వంగడాలతో సాగు చేశా. 125 బస్తాలు దిగుడులు రాగా రూ.ఒక లక్ష 80 వేలు ఖర్చు అయింది. కౌలు 60 బస్తాలు పోగా రూ.94 వేల నగదు చేతికి వచ్చింది. ఈ ఏడాది వరి పంట సాగు వల్ల ఆర్థికంగా నష్టపోయా.

–మేదరమెట్ల వెంకటరావు, రైతు, నూజెండ్ల

5 వేలు అప్పు మిగిలింది



నా సొంత భూమి మూడు ఎకరాల్లో ఎన్ఎల్ఆర్ విత్తనం సాగు చేశా. మూడు ఎకరాల్లో 72 బస్తాలు దిగుబడి వచ్చింది. ఎకరానికి రూ.35 వేలు చొప్పున పెట్టుబడి పెట్టా. ధాన్యం అమ్మగా రూ. లక్ష రూపాయలు మాత్రమే దక్కింది. ఆరుగాలం శ్రమించినప్పటికీ రూ.5 వేలు అప్పు మిగిలింది.

–ములుకూరి శేషిరెడ్డి, రైతు, నూజెండ్ల

34449 రకం రైతును నష్టపరిచింది



ఎన్ఎల్ఆర్ 34449 వరి విత్తనం సాగు చేసిన రైతుల మాత్రమే నష్టపోయారు. వ్యవసాయంలో యజమాన్య పద్ధతులు పంట మార్పిడి విధానం పాటించకపోవటం వలన రైతులు ఆర్థికంగా నష్టపోయారు. విత్తన శుద్ధి చేయటం నారుమళ్లపై కార్బోఫ్యూరాన్ గుళికలు చల్లటం ద్వారా వరి పంటలో తెగుళ్లు నివారించవచ్చు.

–నుగునాబేగం, మండల వ్యవసాయ అధికారి, నూజెండ్ల

సంజీవయ్యా.. మీ సేవలు సజీవమయ్యా!



తుమ్మలకుంటలో నివాళి అర్పిస్తున్న ప్రధానోపాధ్యాయులు రమేష్



వినుకొండలో సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



చిలకలూరిపేటలో సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

శావల్యాపురం: మండలంలోని తుమ్మలకుంట గ్రామం ఎంపీపీ పాఠశాల్లో ఆంధ్రప్రదేశ్ రెండవ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు బిళ్ళ రాజారమేష్ తెలిపారు. ఈసందర్భంగా దామోదరం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలు తీసుకుంటున్న అనేక సంక్షేమ పథకాల రూపకర్త దామోదరం సంజీవయ్య అన్నారు. కేంద్ర-రాష్ట్ర రాజకీయాల్లో మచ్చలేని మహోన్నతి వ్యక్తిగా విలువైన రాజకీయాలు చేశారన్నారు. ఈకార్యక్రమలో ఎస్ఎంసీ చైర్మన్ సిద్దల మోష, విద్యార్థులు పాల్గొన్నారు.

వినుకొండ(నూజెండ్ల): మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు నియోజకవర్గ మాలమహానాడు అధ్యక్షులు కీర్తిపాటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ నందు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 29 సంవత్సరాల వయసులోనే ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని, 31 సంవత్సరాల వయసులోనే ఉమ్మడి మద్రాస్ రాష్ట్ర ప్రభుత్వంలో సి.రాజగోపాలచారి కాబినేట్‌లో మంత్రిగా ఎన్నియ్యారని కొనియాడారు. కేంద్రమంత్రిగా దేశానికి అనేక సేవలు అందించారన్నారు. దేశంలో మొట్టమొదటి పింఛన్ పథకం ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు పమిడిపల్లి ఇశ్రాయేల్, గౌరవ సలహాదారులు కొమ్మతోటి కృపయా, ప్రధానకార్యదర్శి బొందలపాటి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు బేతం దేవానంద్, మండల ప్రధానకార్యదర్శి పిడతల రాజా, రాయన చిన్న, కొట్టే వెంకట్రావు, అంబడపూడి శ్రీను, పల్లపాటి భాస్కర్, బిల్లా ఇశ్రాయేలు తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట: ప్రతిభకు ప్రతి రూపం రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య అని గార్డ్స్ సంస్థ డైరెక్టర్, మాజీ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ దాసరి చిట్టిబాబు చెప్పారు. జ్ఞానేశ్వర్ అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో దామోదరం సంజీవయ్య జయంతిని శుక్రవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రిటైర్డ్ ఎక్సైజ్ సీఐ గోరంట్ల నారాయణ, నాయుడు వాసు, గుంజి వీరాంజనేయులు, టి.ప్రతాపరెడ్డి, జె బుల్లిబాబు, వి.చంద్రం తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో...

దామోదరం సంజీవయ్య విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో రైతు బజారు ఎదురు విగ్రహ నిర్మాణ స్థలం వద్ద ఆయన శతజయంతిని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విగ్రహ కమిటీ అధ్యక్షుడు సాతులూరి రవికుమార్, వివిధ పార్టీల నాయకులు ఎం రాధాకృష్ణ, డి.పుల్లయ్య, బొందు చిన్న, డి.నాగేశ్వరరావు, సలాం, బాజి తదితరులు పాల్గొన్నారు.

సేవకు ప్రతిరూపం రోటరీ సంస్థ

చిలకలూరిపేట: సేవకు ప్రతిరూపం రోటరీ సంస్థ అని రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ శరత్‌చౌదరి చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం ఆధ్వర్యంలో రోటరీ జిల్లా గవర్నర్ అధికారిక పర్యటనలో భాగంగా పట్టణంలోని గ్రాండ్ వెంకటేష్ ఫంక్షన్ హాలులో శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శరత్ చౌదరి మాట్లాడుతూ స్నేహం ద్వారా సేవలు అనే కార్యక్రమం ద్వారా రోటరీ క్లబ్ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన తదితర విషయాలపై దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం గత 37 సంవత్సరాలుగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కనపర్రు నైస్ పాఠశాలకు మూడు క్వింటాళ్ల బియ్యం, మార్టూరు శారదా నికేతన్‌కు రెండు క్వింటాళ్ల బియ్యం, నిత్యావసరాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ గవర్నర్ కె.శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం అధ్యక్షుడు వారణాసి శరత్ కుమార్ శాస్త్రి, కార్యదర్శి కొల్లా వెంకట సుబ్బారావు, కోశాధికారి జంపని శ్రీనివాసరావు, సభ్యులు బోనం వెంకటేశ్వరరావు, రాజు, సింగరావు, చెంచుపున్నయ్య, దాసునాయన తదితరులు పాల్గొన్నారు.



బియ్యం బస్తాలు పంపిణీ చేస్తున్న శరత్ చౌదరి, క్లబ్ సభ్యులు

ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు ఎన్‌సీసీ యూనిట్

నరసరావుపేట ఈస్ట్: చిలకలూరిపేట రోడ్డులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు ఎన్‌సీసీ యూనిట్ మంజూరైంది. ఈమేరకు 23 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ఎం.ఎస్.పర్మార్ శుక్రవారం పాఠశాలలో ఎన్‌సీసీ పతాకాన్ని ఆవిష్కంచారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాల విద్య నుంచే విద్యార్థులకు క్రమశిక్షణ, ఐక్యతా భావాలను అలవరిచేందుకు ఎన్‌సీసీ దోహదపడుతుందని స్పష్టం చేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసే యూనిట్‌లో 52 మంది విద్యార్థులకు ఎన్‌సీసీలో చేరేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాశరావు, జీఎం సి.హెచ్.రామరాజు, ప్రిన్సిపల్ అల్పన ఒనియల్, ఎన్‌సీసీ సుబేదార్ ముఖేష్ కుమార్ జాట్ పాఠశాల ఎన్‌సీసీ కేర్ టేకర్ టి.భూపతి, ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ బీఎస్ఆర్‌కె రాజు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో టైనీటాట్స్ పూర్వ విద్యార్థుల ప్రతిభ



విలేకరులతో మాట్లాడుతున్న టైనీటాట్స్ డైరెక్టర్లు

నరసరావుపేట ఈస్ట్: జాతీయస్థాయిలో నిర్వహించిన జేఈఈ మెయిన్స్- 2025 ఫలితాలలో టైనీటాట్స్ పాఠశాల ఐఐటీ ఫౌండేషన్ పూర్వ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని పాఠశాల డైరెక్టర్ పాతూరి భానుతేజ తెలిపారు. పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భానుతేజ మాట్లాడుతూ, తమ పాఠశాలలో పటిష్టమైన విద్యా ప్రణాళికను అమలు పరచటం, ఐఐటీ ఫౌండేషన్ కోర్సును ప్రాథమిక స్థాయి నుంచి అభ్యసించటం ద్వారా జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో ఘన విజయాన్ని సాధించారని తెలిపారు. తమ విద్యార్థులు 15 మంది 99 పర్సంటైల్, 28 మంది 90 పర్సంటైల్ సాధించి పల్నాడుజిల్లాలోనే అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. వారిలో లక్ష్మీలాస్య, శ్రవంత్ ఫిజిక్స్‌లో నూటికి నూరు మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థులకు బోధన సమయంలో విశ్లేషనాత్మక వివరణలు, అంతర్గత పోటీ పరీక్షల్లో మార్కులను పరిగణనలోకి తీసుకొని ఎప్పటికప్పుడు వారి నైపుణ్యాలను పెంచటం ద్వారా ఈ ఫలితాలు సాధ్యపడ్డాయని వివరించారు. అలాగే పాఠశాల ఐఐటీ ఫౌండేషన్ అధ్యాపకులను అభినందించారు. సమావేశంలో డైరెక్టర్లు పాతూరి శ్రీనివాసరావు, కోటమ్మ, ఏఓ కరణం కొండలరావు పాల్గొన్నారు.

15 మందికి జాతీయ ఉపకార వేతనాలు



నాదెండ్ల: గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న 15 మంది విద్యార్థులు జాతీయ ఉపకార వేతనాలకు అర్హత సాధించారు. గతేడాది డిసెంబర్ 8న నరసరావుపేటలో వ్రాత పరీక్ష నిర్వహించారు. ఈ పాఠశాల నుంచి 44 మంది పరీక్షకు హాజరు కాగా, హెచ్ ఆదిత్య, సీహెచ్ దినేష్, పూర్ణిమ, హరీష్, తులసీచైతన్య, ఎస్తేరురాణి, మార్త పావని, అద్దంకి హేమశ్రీ, ఎ.ప్రత్యూష, సీహెచ్ ఆకాంక్ష, కె.అనూహ్య, బి రమ్యశ్రీ, ఎ శ్రావ్య, జి.దేవకి, యు. జశ్వంత్‌కుమార్ ఉపకార వేతనాలకు ఎంపికయ్యారు. వీరికి ప్రభుత్వం 9,10 తరగతులు, ఇంటర్ రెండు సంవత్సరాలు ప్రతి ఏడాది రూ.12 వేలు నగదును వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

చైన్ స్నాచర్ అరెస్ట్

నరసరావుపేటటౌన్: వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు లాక్కొని పారిపోయిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ హైమారావు శుక్రవారం తెలిపారు. రజకవాడ ప్రాంతానికి చెందిన కొత్తమాసు పుష్పావతి గత నెల 31వ తేదీ ఇంటి బయట కూర్చొని ఉండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన యువకుడు ఆమె మెడలో బంగారు గొలుసు లాక్కొని పరారీ అయ్యాడు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

డిపార్ట్‌మెంట్ ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకోవాలి

తపాలా కార్యాలయం ఎదుట జేఏసీ ఉద్యోగుల ఆందోళన

నరసరావుపేటటౌన్: తపాలా శాఖ ఏకపక్ష ధోరణితో తీసుకున్న నిర్ణయాలను వెంటనే వెనక్కు తీసుకోవాలని పోస్టల్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డివిజినల్ తపాల కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ డిపార్ట్‌మెంట్ ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకోవడమే ఏకైక లక్ష్యంగా యూనియన్‌లు అంతా ఏకతాటిపై వచ్చాయన్నారు. డిపార్ట్‌మెంట్ పరిరక్షణకు జేఏసీగా ఏర్పడి నడుం బిగించాయన్నారు. అధికారులు, సిబ్బంది అన్న తేడా లేకుండా కలిసికట్టుగా ఉద్యమంలో పాల్గొని డిపార్ట్‌మెంట్‌ను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ ఆర్గనైజేషన్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్‌ల ప్రతినిధులు సిహెచ్ లక్ష్మీనారాయణ, సింహాద్రి వేణు, సిహెచ్ వెంకటేశ్వర్లు, యోగేశ్వరావు, జాన్‌సైదా తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన నిర్వహిస్తున్న జేఏసీ నాయకులు

వివరాలు నమోదు చేసుకోండి

నాదెండ్ల: వ్యవసాయ రంగంలో అన్నదాతలను ఆదుకునేందుకు, పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలు అమలు చేస్తున్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని పల్నాడు జిల్లా ఏడీఏ రవికుమార్ చెప్పారు. సాతులూరు రైతుసేవా కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. కార్యక్రమంలో స్థానిక ఏవో హరిప్రసాద్, జిల్లా వ్యవసాయ కార్యాలయం ఏవో ప్రియదర్శిని, ఏఈవోలు జీవన్‌నాయక్, రామారావు, వేణుగోపాల్ ఉన్నారు.

ప్రతి రైతుకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య

శావల్యాపురం: పొలం ఉన్న ప్రతి ఒక్క రైతు కూడా రైతుసేవా కేంద్రాల్లో ఫార్మర్ రిజిస్ట్రీ (రైతున మోదు)ను చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా ఏవో రామారావు మాట్లాడుతూ రైతు నమోదు చేయించుకోవటం వలన కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, సున్నావడ్డీ పథకాలు, పంట రుణాలు తదితరవన్నీ అర్హత పొందుతారన్నారు. ఫార్మర్సీ నమోదు వలన ఆధార్, పొలం పాసుపుస్తకం 1బి ఆధార్ కార్డుకు లింకు అయిన మొబైల్ నంబరు ఫార్మర్సీ నమోదు రైతులు చేయించుకోవాలన్నారు.


బొల్లాపల్లి: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయించడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి ఎ. అంకారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్య కేటాయించడంతో పాటు అనంతరం కార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి రైతు తనకు సంబంధించిన ఆధారాలను రైతు సేవా కేంద్రంలోని సిబ్బందిని కలిసి సమర్పించి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతిరైతు తప్పనిసరిగా రైతు సేవా కేంద్రంలోని వ్యవసాయ సిబ్బందిని కలిసి నమోదు చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాదెండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ డీఈఈ అశోక్‌కుమార్ తెలిపారు. గణపవరం సబ్ స్టేషన్ మినహా నాదెండ్ల, అమీన్ సాహెబ్‌పాలెం, సాతులూరు సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సరఫరా నిలిచిపోతుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో పెద్దారవీడు వాసి మృతి

మరో ముగ్గురికి తీవ్ర గాయాలు



శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి మార్గంలో గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు కథనం ప్రకారం.. గుంటూరు నుంచి ప్రకాశం జిల్లా పెద్దారవీడుకు ఎలక్ట్రానిక్ సామాను లోడుతో వస్తున్న వాహనాన్ని ఎదురుగా దోర్నాల నుంచి పిడుగురాళ్ళకు వస్తున్న మరో వాహనం ఢీకొంది. ఈఘటనలో పెద్దారవీడు గ్రామానికి చెందిన అమనగంటి వెంకట రమణ సంఘటన స్థలంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు సంఘటన స్థలానికి హుటాహుటీన చేరుకొని తీవ్ర గాయాలతో బాధపడుతున్న సనకాల గోపి, సనకాల ఆంజనేయులు, కొటపాటి గోపి క్షతగాత్రులను 108 అత్యవసర వాహనంలో వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించేలా చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి శవపంచనామా అనంతరం బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జొన్నలగడ్డలో ఆర్‌యూబీని ఏర్పాటు చేయాలి



రైల్వే అధికారులకు వినతిపత్రం సమర్పిస్తున్న గ్రామ రైతులు

నరసరావుపేట రూరల్: జొన్నలగడ్డ సమీపంలోని రైల్వే లైన్ వద్ద రెండవ ఆర్‌యూబీని ఏర్పాటుచేయాలని రైతులు రైల్వే అధికారులను కోరారు. మలుపుతో, తక్కువ ఎత్తుతో ఏర్పాటుచేసిన మొదటి ఆర్‌యూబీ వలన రైతులు పడుతున్న ఇబ్బందులను జిల్లా కలెక్టర్ గ్రామస్తులు గ్రీవెన్స్‌లో తెలియజేశారు.

దీనిపై స్పందించిన రైల్వే అధికారులు శుక్రవారం గ్రామంలో పర్యటించా రు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను రైతులు రైల్వే అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఆర్‌యూబీలో మలుపు వలన ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదని, తక్కువ ఎత్తుతో ఉండటం వలన ట్రాక్టర్లతో పొలాల నుంచి వరి గడ్డిని తీసుకురావడం కష్టంగా మారుతుందని తెలిపారు. రెండవ ఆర్‌యూబీని తొమ్మిది అడుగుల ఎత్తు, తొమ్మిది అడుగుల వెడల్పుతో ఏర్పాటుచేయాలని కోరారు. దీనిపై స్పందించిన రైల్వే అధికారులు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

డిగ్రీ ఫలితాల్లో కృష్ణవేణి విద్యార్థుల ప్రతిభ



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో కృష్ణవేణి ప్రిన్సిపల్ నాతాని

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రకటించిన డిగ్రీ 5వ సెమిష్టర్ పరీక్షా ఫలితాలలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. తమ విద్యార్థులు టి.హేమ బిఎస్సీ ఎంపీసీఎస్‌లో 800 మార్కులకు గాను 783, సయ్యద్ మన్సురున్నీసా బిఎస్సీ ఎంఎస్‌సీఎస్‌లో 754 మార్కులు సాధించారన్నారు. అలాగే షేక్.కరిమున్నీ బిజడ్‌సీలో 900 మార్కులకు గాను 862, ఏ.సునీత బిఎస్సీ ఎంబిసీసీఎస్‌లో 852, బి.కజియారాణి బిఎస్సీ (అగ్రి)లో 851 మార్కులు, సయ్యద్ మోమినకౌసర్ బికాం కంప్యూటర్స్‌లో 700మార్కులకు గాను 617 మార్కులతో వర్సిటీ స్థాయిలో ప్రతిభ చాటారని వివరించారు. విద్యార్థులను కళాశాల వైస్‌ప్రిన్సిపల్ ఎంఆర్‌కె సతీష్‌బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ డి.యోగేశ్వరరావు, అధ్యాపకులు అభినందించారు.

డిగ్రీ ఫలితాల్లో వాగ్దేవి విద్యార్థుల ప్రతిభ



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో వాగ్దేవి ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాదు

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రకటించిన డిగ్రీ 5వ సెమిష్టర్ పరీక్షా ఫలితాలలో వాగ్దేవి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపల్ కపలవాయి రాజేంద్రప్రసాదు శుక్రవారం తెలిపారు. తమ విద్యార్థులు బి.స్రవంతి బిఎస్సీ ఎంపీసీఎస్‌లో 800 మార్కులకు గాను 743, సిహెచ్.శ్వేత 736, వై.పూజిత ఎంఎస్‌సీఎస్‌లో 727, జి. నాగకుసుమ 726, బికాం కంప్యూటర్స్‌లో ఏ.రాజేశ్వరీ 700 మార్కులకు గాను 626, సిహెచ్.శ్రావణి 608 మార్కులు సాధించారని వివరించారు. విద్యార్థులను కళాశాల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, ఒగూరి నాగేశ్వరరావు, మద్దుల కోటేశ్వరరావు తదితరులు అభినందించారు.